కన్హా శాంతివనానికి ఉప రాష్ట్రపతి

▸▸ నేడు ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొననున్న జగదీప్ ధన్కర్



నందిగామ, ఆగస్టు 16 : భారత ఉప రాష్ట్రపతి జగదీప్ దన్కర్ శుక్రవారం నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనానికి వచ్చారు. ఆయన రాత్రి అక్కడే బస చేశారు. నేడు(శనివారం) కన్హా శాంతివనంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి పాల్గొననున్నట్లు సమాచారం.

చల్లంగా దీవించు తల్లీ..!

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక సందడి ● లక్ష్మీదేవికి ప్రత్యేక అలంకరణలు

పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతాలు ● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ఆమనగల్లు సత్యసాయి మందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలలో పాల్గొన్న మహిళలు



శంకర్‌పల్లి విరలేశ్వరాలయంలో పూజలు చేసేందుకు వచ్చిన భక్తులు



శ్రావణ శుక్రవారం జిల్లావ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలు సంస్కృతీ సంప్రదాయాన్ని చాటాయి. తెలుగింటి ఆడపడుచులకు సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని ఇచ్చే పండుగైన వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఆలయాలలో మహిళలు పెద్ద సంఖ్యలో వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాలు, ఇళ్లను శోభాయామానంగా అలంకరించారు. ఏ ఇంట చూసిన శ్రావణ వరలక్ష్మీ శోభ, ఆధ్యాత్మిక వాతావరణం వెల్లి విరిసింది. పూజలకు అవసరమైన పూలు, పండ్లు, పూజా సామగ్రిని పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. దీంతో వాటి ధరలు భారీగా పెంచారు. దేవాలయాలతో పాటు ఇళ్లల్లో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు, వ్రతాలు చేశారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్ రంగారెడ్డి జిల్లా



షాద్‌నగర్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు



ఇబ్రహీంపట్నంలోని త్రిశక్తి ఆలయంలో మహిళల సందడి

ఐదు నిమిషాలు ఆగమన్నందుకు..

స్టాఫ్ నర్సుపై మహిళ దాడి

కుక్కకాటు విరుగుడు ఇంజక్షన్ కోసం వచ్చి రెచ్చిపోయిన పేషంట్

నిరసనకు దిగిన వైద్యులు, సిబ్బంది



ఆసుపత్రి ఎదుట నిరసనకు దిగిన వైద్యులు, సిబ్బంది

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 16 : కుక్కకాటు విరుగుడు ఇంజక్షన్ కోసం వచ్చిన ఓ పేషెంట్‌ను ఐదు నిమిషాలు ఆగమన్నందుకు రెచ్చిపోయి స్టాఫ్ నర్స్‌పై దాడికి దిగింది. ఈ ఘటన షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో గురువారం సాయంత్రం వెలుగుచూసింది. కాగా, స్టాఫ్ నర్స్‌పై దాడికి నిరసనగా శుక్రవారం విధులను బహిష్కరించిన ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. గురువారం సాయంత్రం కుక్కకాటుకు గురైన భార్గవి అనే మహిళ రెండో డోస్ ఇంజెక్షన్ కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి వచ్చింది. ఆమె వద్ద ఇంజెక్షన్‌కు సంబంధించిన కార్డు లేకపోవడంతో ఆశా అనే స్టాఫ్ నర్స్. కార్డు తీసుకురావాలని చెప్పింది. దాంతో భార్గవి తన భర్త సంఘమేశ్వర్‌ను అక్కడే ఉంచి ఇంటికి వెళ్లి కార్డు తీసుకొచ్చింది. అనంతరం ఆమెను ఐదు నిమిషాలు ఆగమని చెప్పడంతో.. ఆగ్రహంతో రెచ్చిపోయిన భార్గవి స్టాఫ్ నర్స్‌పై దాడి చేసింది. ఇందుకు నిరసనగా శుక్రవారం వైద్యులు, సిబ్బంది విధులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విధులు నిర్వహించాలంటే భయంగా ఉందని, నిస్వార్థంగా సేవ చేస్తున్న వైద్యులు, సిబ్బందిపై దాడి చేయడం దారుణమని అన్నారు. స్టాఫ్ నర్స్ ఫిర్యాదు మేరకు శుక్రవారం భార్గవిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.



షాద్‌నగర్‌లో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

శంషాబాద్‌లో భారీ వర్షం



శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి జలమయమైన రోడ్లు

శంషాబాద్/షాద్‌నగర్, ఆగస్టు 16 : శంషాబాద్‌లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో బస్తీలలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. శంషాబాద్ బస్టాండు నుంచి రాళ్లగూడ రోడ్డు, కొత్వాల్‌గూడ నుంచి సిద్ధాంతి రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి వీకర్ సెక్షన్ కాలనీ రోడ్లు పూర్తిగా వరద నీటితో నిండిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. షాద్‌నగర్‌లో మోస్తరు వర్షం కురిసింది. రోడ్లు జలమయమై, లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి నీరు చేరింది.

హరితహారం పథకం కింద మొక్కలు నాటాలని ప్రభుత్వం చెప్పగానే అధికారులు కిందిస్థాయి ఉద్యోగులకు టార్గెట్లు పెడుతున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు పూర్తిస్థాయిలో మొక్కలు నాటాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో కిందిస్థాయి అధికారులు కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. టార్గెట్లు పూర్తి చేసేందుకు రోడ్డు పక్కన విద్యుత్ తీగల కింద మొక్కలను నాటుతున్నారు. అవి కొంచెం పెరగగానే చెట్లు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని నరికేస్తున్నారు. దీంతో నాటిన మొక్కల వల్ల ప్రయోజనం లేకపోగా.. వాటిని కొట్టి వేయడం వల్ల ప్రభుత్వానికి రెండు విధాలుగా ఆర్థిక భారం పడుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు.



షాద్‌నగర్‌లో విద్యుత్ తీగల కింద నాటిన మొక్కలు

విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటడం

- ▸▸ అవి పెరగగానే విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్నాయని నరకడం
- ▸▸ అవగాహనా రాహిత్యంతో హరితహారం
- ▸▸ కనీస ఆలోచన లేని అధికారులు
- ▸▸ రెండు విధాలుగా సర్కారుకు ఖర్చు ▸▸ అయినా ఫలితం శూన్యం

నాటుడు.. నరుకుడు!



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 16: పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలన్న ప్రభుత్వాల ఆశయం అధికారుల, ప్రజాప్రతినిధుల అవగాహన లోపం వృక్షాలకు శాపంగా మారుతోంది. పచ్చదనం, హరితహారం లాంటి కార్యక్రమాలలో భాగంగా నర్సరీలను పెంచి, ప్రతి యేటా పల్లెలు, పట్టణాలతో పాటు రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వాలు మొక్కలను నాటిస్తున్నాయి. వాటి సంరక్షణకు నిధులు ఇస్తున్నాయి. అయితే ప్రభుత్వం నిర్ణయించిన టార్గెట్‌ను పూర్తి చేశామా లేదా అన్న కోణంలో మొక్కలను నాటిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం వాటిని ఎక్కడ నాటుతున్నాం, అవి ఎంత ఎత్తు, విస్తీర్ణంలో పెరుగుతాయన్న ఆలోచన చేయడం లేదు. రోడ్లకు ఇరువైపులా విద్యుత్తు లైన్లను పట్టించుకోకుండా మొక్కలను నాటుతున్నారు. అవి రెండు, మూడు సంవత్సరాలలో పెరిగి చెట్ల కొమ్మలు వర్షాలకు, ఈదురు గాలులకు విరిగి పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గిస్తున్నాయి. దీంతో విద్యుత్ శాఖ ప్రతి యేటా విద్యుత్ లైన్ల కింద పెరిగే చెట్ల కొమ్మలను నరికి వేయిస్తోంది. దీంతో ప్రభుత్వ వ్యయం వ్యర్థమవుతోంది. ఇప్పటికైనా విద్యుత్ లైన్ల కింద గుబురుగా పెరిగే పండ్లు, పూల మొక్కలను మాత్రమే నాటి, విద్యుత్ లైన్లు లేని ప్రాంతాల్లోనే వృక్షాలు, మహా వృక్షాలుగా పెరిగే జాతి మొక్కలను నాటితే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



ప్రభుత్వ డబ్బు వృథా

అధికారుల, ప్రజాప్రతినిధుల అవగాహన లోపంతో విద్యుత్తు లైన్ల కింద మొక్కలను నాటడమంటే ప్రభుత్వ డబ్బు వృథా చేయడమే. విద్యుత్తు లైన్ల కింద నాటిన మొక్కలు చెట్లుగా ఎదగగానే విద్యుత్ శాఖ నరికివేస్తోంది. నాటేటప్పుడు, నరకడానికి నిధులను వినియోగించాల్సి వస్తున్నా ప్రతి యేటా విద్యుత్ వైర్ల కింద మొక్కలను నాటడం మాత్రం మానడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ వైర్ల కింద ఎత్తు పెరగని, పూలు, పండ్ల మొక్కలను మాత్రమే నాటాలి.

బి. జగన్‌మోహన్‌రెడ్డి, వృక్ష ప్రేమికుడు,షాద్‌నగర్



సిబ్బందికి అవగాహన కల్పిస్తాం

షాద్‌నగర్ పట్టణంలోని విద్యుత్ లైన్ల కింద వృక్షాలుగా ఎదిగే మొక్కలను నాటకుండా సిబ్బందికి అవగాహన కల్పిస్తాం. ఇటీవల నాటిన మొక్కలను పరిశీలిస్తా. అవి ఎత్తుగా వృక్షాలుగా ఎదిగే మొక్కలైతే వాటిని తీయించి ఇతర ప్రాంతాల్లో నాటిస్తా. వాస్తవానికి విద్యుత్ లైన్ల కింద వృక్షాలుగా ఎదిగే మొక్కలను నాటిస్తే సమస్యలు వస్తున్నాయి. ఇక ముందు వాటికింద పూలు, గుబురుగా పెరిగే పండ్ల మొక్కలను మాత్రమే నాటేలా చర్యలు తీసుకుంటాం.

వెంకన్న, కమిషనర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ



విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని నరికిన చెట్లు

షాద్‌నగర్ దళిత మహిళ వ్యవహారంలో..

డీఐ సహా నలుగురు కానిస్టేబుళ్లపై కేసు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 16: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వ్యవహారంలో పోలీసులపై కేసు నమోదైంది. గతనెల 30న దొంగతనం ఆరోపణలతో సునీత అనే మహిళపై, ఆమె కోసం వచ్చిన ఆమె భర్త, కుమారుడిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయింది. దీనిపై ఈనెల 11న సునీత షాద్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏసీపీ రంగస్వామి విచారణ జరిపి కమిషనర్‌కు నివేదిక అందజేశారు. దాంతో సునీతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) రాంరెడ్డి, నలుగురు కానిస్టేబుళ్ల మీద ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం, ఉద్దేశపూర్వకంగా హింస, మారణాయుధాయులతో దాడి, తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని హైకోర్టు న్యాయవాది, సమతా సైనిక్‌దళ్ సలహాదారు, డాక్టర్ కార్తీక్ నవయన్ డిమాండ్ చేశారు. డీఐ రాంరెడ్డి, నలుగురు కానిస్టేబుళ్లను సర్వీసు నుంచి తొలగించడంతో పాటు చట్టపరంగా శిక్షించాలని కోరారు.



పోలీసులపై నమోదైన ఎఫ్ఐఆర్



సాయిల్ టెస్ట్ జరపొద్దంటూ ఆందోళన చేస్తున్న రైతులు

కుర్మిద్ద ఫార్మాసిటీ భూముల్లో

భూసార పరీక్షలకు రైతుల అడ్డు

▸▸ అక్కడ ఫార్మాసిటీ వద్దని, ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్



సాయిల్ టెస్ట్ చేస్తున్న సాంకేతిక నిపుణులు

యాచారం, ఆగస్టు 16: యాచారం మండలం కుర్మిద్ద గ్రామంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో శుక్రవారం టీఎస్ఐఐసీ అధికారులు, సాంకేతిక నిపుణులు భూసార పరీక్షలు(సాయిల్ టెస్ట్) చేసేందుకు వెళ్లగా రైతులు అడ్డుకున్నారు. అక్కడ ఫార్మాసిటీ వద్దని, కాలుష్య రహిత పరిశ్రమలు, ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయడానికి తమకు అభ్యంతరం లేదని చెప్పారు. ఫార్మాసిటీ ప్రతిపాదనను రద్దుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేవరకూ సాయిల్ టెస్టులు చేయరాదని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ రైతులను సముదాయించడానికి యత్నించినా వారు వినలేదు. దాదాపు నాలుగు గంటలు అధికారులను అడ్డుకునేందుకు రైతులు శతవిధాలా యత్నించారు. దీంతో, భారీగా పోలీసులను మోహరించారు. కుర్మిద్ద తండా సమీపంలోని సర్వేనెంబర్ 311లో 460 ఎకరాల భూములున్నాయి. ఈ భూములను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించింది. కాగా, 30-50 అంతస్తుల భవనాలు నిర్మించడానికి ఈ భూములు అనువుగా ఉన్నాయా.. లేదా అన్నదాన్ని తెలుసుకోవడం కోసం నాలుగు రోజుల పాటు భూసార పరీక్షలు చేస్తామని అధికారులు వెల్లడించారు.

ఘనంగా పోచమ్మ దేవత బోనాలు

కొందుర్గు మండల కేంద్రంలో శుక్రవారం పోచమ్మ దేవతకు బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచే గ్రామస్థులు దేవాలయానికి వచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి గ్రామంలోని పురవీధుల గుండా మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. దేవాలయం వద్దకు చేరుకొని అమ్మవారి దేవాలయం చుట్టు ప్రదక్షిణలు చేసి బోనం సమర్పించారు. తమను, తమ గ్రామాన్ని పోచమ్మ అమ్మవారు చల్లగా చూడాలని కోరుకున్నారు. అంతకుముందు గౌడ సోదరులు పోచమ్మ అమ్మవారికి కల్లు ఘటాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, కావలి యాదయ్య, కె రామయ్యగౌడ్, ఈశ్వరయ్య గౌడ్, జగన్ గౌడ్, వాసూరి, కృష్ణయ్యగౌడ్, సి కృష్ణయ్య, వేణు, చంద్రశేఖర్, అశోక్‌గౌడ్, సురేందర్‌గౌడ్, రాజుగౌడ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు, ఆగస్టు, 16




ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు





ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్, ఆగస్టు 16: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024- 2025 విద్యా సంవత్సరం డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఫియా ఖానమ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. డిగ్రీ 2015-16 నుంచి 2023-2024 వరకు అడ్మిషన్ పొంది ఫీజు సకాలంలో చెల్లించని వారు ఆగస్టు 31వ తేదీ లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు.



నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ

వికారాబాద్, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు బీసీడీడబ్ల్యూవో ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిఫ్రిజిటర్, వాషింగ్ మిషన్, ఎయిర్ కండిషనర్ రిపేర్, ఇన్‌స్టాలేషన్, గ్యాస్ ఛార్జింగ్‌కు 10వ తరగతి లేదా ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియట్, ఒకేషనల్ చదివిన వారు అర్హులని తెలిపారు. అదేవిధంగా ఎల్ టీవీ, ఓఎల్‌ఈడీ మానిటర్, మైక్రోవేవ్ ఓవెన్, వాటర్ ప్యూరిఫైర్ బేసిక్ ఏ రిపేర్, ఇన్‌స్టాలేషన్‌కు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఒకేషనల్ అర్హత కలిగిన వారికి 90 రోజులపాటు శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ సంస్థ నుంచి నెలకు రూ.4వేల చొప్పున మూడు నెలలు ట్రెయినింగ్ పీరియడ్ స్టైఫండ్ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణ సమయంలో స్టడీ మెటీరియల్, లంచ్, టీషర్ట్స్, బ్యాగ్, సర్టిఫికేషన్, ప్లేస్‌మెంట్ ఇవ్వబడుతుందని తెలిపారు. వయస్సు 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండి సంవత్సర ఆదాయము 5లక్షల లోపు ఉన్నవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. 10వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఆగస్టు 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

డీఆర్డీవో సాంబశివరావు


పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో సాంబశివరావు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 16: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అభించాలని డీఆర్డీవో సాంబశివరావు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఎదులాబాద్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ అర్బన్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా? పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్యలు ఏమైనా ఉన్నాయానే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్‌లో వంట సామగ్రిని, అన్నం, కూరలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





నేటి నుంచి ఉర్సే-ఎ- షరీఫ్ ఉత్సవాలు

- ముస్తాబైన ముర్షద్ దర్గా
- నాలుగు రోజుల పాటు ఉర్సు



తాండూరు, ఆగస్టు 16: దశాబ్దాల చరిత్ర కలిగిన తాండూరు హజ్రత్ సయ్యద్ అబ్దుల్ సలీం పాషా సాహిబ్ ఖిబ్లాచిష్తి 78వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలకు ముర్షద్ దర్గా ముస్తాబైయింది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ముతవల్లి సయ్యద్ అబ్దుల్ గనిపాషా ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 17న (శనివారం) సాయంత్రం 5గంటలకు ఘసుల్ షరీఫ్, రాత్రి 7గంటలకు జల్సా ఫైజాన్-ఎ-అవలయా, 18న (ఆదివారం) గంధం, రాత్రి 7గంటలకు ఇంటి నుంచి బయల్దేరి 8 గంటలకు దర్గా షరీఫ్ చేరి సందల్ కార్యక్రమం, 19న (సోమవారం) దీపోత్సవం, రాత్రి 9.30గంటలకు ఖవ్వాలి, 20న (మంగళవారం) సమాజ్‌బాద్ ఫజర్ తిలావర్ ఖురాన్, ఫాతిహాఖ్వాలి, ప్రసాద వితరణ కార్యక్రమలుంటాయని నిర్వాహకులు సయ్యద్ అబ్దుల్ గని పాషాలు తెలిపారు. ఈ ఉత్సవాలకు తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని తాండూరు పట్టణం తాండూరు, పెద్దేముల్, బషీరాబాద్, యాలాల, మండలాల, కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, బొంరాస్‌పేట్, కర్ణాటక రాష్ట్రం చించోళి, సేడేం, గుల్బార్గా ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొంటారు. ఈ ఉత్సవాల్లో దీపోత్సవం, ఖవ్వాలి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిర్వహిస్తారు. దర్గా, పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

నేడు భూకైలాస్‌లో శనీశ్వరుడికి పూజలు



భూకైలాస్‌లోని శనీశ్వరస్వామి

తాండూరు రూరల్, ఆగస్టు 16: మండలంలోని అంతారం తండాలో వెలిసిన భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో నేడు(శనివారం) శనీశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు తెలిపారు. శని త్రయోదశి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు ఉదయం 6గంటలకు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించాలన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులు వక్కలు-5, ఖర్జూర పండ్లు-5, నువ్వులు నూనె-1, నల్లనువ్వు -100 గ్రాములు, నల్ల ద్రాక్ష-1/2, తమలపాకులు-11, నల్లజిల్లేడు పూలు లేదా ఆకులు, టెంకాయలు-2, నలుపు జాకెట్-1, లేదా నల్లదారం తీసుకురావాలన్నారు. అదేవిధంగా ఇనుముతో చేసిన వస్తువు దానం చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9010800769కు సంప్రదించాలని సూచించారు.

మోమిన్‌పేట్: మండలంలోని శనీశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుద్ధ త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితుడు రాముశర్మ తెలిపారు. స్వామివారికి సామూహిక తైలాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పనుల్లో వేగం పెంచండి

- అమృత్ భారత్ పనులను పకడ్బందీగా చేపట్టాలి
- తాండూరు, సేడం స్టేషన్‌లను పరిశీలించిన డీఆర్ఎం



పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం

తాండూరు, ఆగస్టు 16: అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వేశాఖ డీఆర్ఎం భర్తేష్ కుమార్‌జైన్ ఆదేశించారు. తాండూరు రైల్వేస్టేషన్‌తో పాటు సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం సేడం, రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అమృత్ భారత్ కింద చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైల్వేలో ఆధునీకరణ పనులను పకడ్బందీగా చేపట్టాలని ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలిగించవద్దని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. రూ.27కోట్లతో తాండూరు రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న ఆధునీకరణ పనులకు సంబంధించి పనులు ఏఏ దశలున్నాయి? ఏఏ పనులు పూర్తి చేశారు? ఇంకా చేయాల్సిన పనులేంటి? ఏమైనాఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. వెయిటింగ్ హాల్, టికెట్ బుకింగ్ కౌంటర్లు, పార్కింగ్ స్థలం, ఎక్సలేటర్ వంటి తదితర పనులు ఎంత వరకు వచ్చాయని ఆయన అడిగారు. ఈ పనులు పురోగతిలో ఉన్నట్లు కాంట్రాక్టర్ వివరించారు.

వైభవంగా గ్రామదేవతల పునఃప్రతిష్ఠాపనోత్సవం

కొత్తూర్‌లో సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ



సర్వాంగ సుందరంగా నిర్మించిన పోచమ్మ ఆలయం



పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దంపతులు

కొత్తూర్, ఆగస్టు 16: మున్సిపాలిటీలోని గ్రామ దేవతల పున ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం(మొదటి రోజు) నిరర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీలోని పోచమ్మ, మైసమ్మ ఆలయాలతో పాటు ఎల్లమ్మ ఆలయాన్ని దాతల సహకారంతో కోట్లాది రూపాయలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచి కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గోపూజ గురుప్రార్థన, గణపతిపూజ పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, దీక్షాధారణం, అఖండస్థాపనం, తీర్థప్రసాద వితరణ, యాగశాల ప్రవేశం నిర్వహించారు. సాయంత్రం మృత్యుంగ్రహణం, అంకురారోపణం, అగ్నిమధన, వాస్తుమర్మఘ్మీకరణం, మండదేవతాహోమం, మంగళహారతి, తీర్థప్రసాదవితరణ కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేదర్‌యాదవ్ దంపతులతో పాటు, పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులు పెద్దయెత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. కొత్తూర్ పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విద్యుద్దీపాలంకరణతో భారీ స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. కౌన్సిలర్లు నర్సింహగౌడ్, హేమదేవేందర్‌ముదిరాజ్, ప్రసన్నలత యాదయ్య, సోమ్లనాయక్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, నాయకులు కడెంపల్లి సదానంద్‌గౌడ్, బాతుక లక్ష్మయ్యయాదవ్, జె.సుదర్శన్‌గౌడ్, కడెంపల్లి శ్రీనివాస్, గోవింద్‌రెడ్డి, జంగగళ్ల కృష్ణయ్య, కమ్మరి జనార్దన్, జె. శ్రీనివాస్, మాసుల అంజయ్య, కర్రొళ్ల సురేందర్, మాదారం కృష్ణగౌడ్, వీరమోని వెంకటేష్, వీరమోని శ్రీనివాస్, బండి కృష్ణ, రాఘవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 16 : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ మంత్రి, మహేశరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్డీ తండాలో నూతనంగా ప్రతిష్ఠించిన పెద్దమ్మతల్లి విగ్రహ పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గ్రామదేవతలైన పెద్దమ్మ, పోచమ్మ, మైసమ్మ, దుర్గమ్మలను ఆరాధించడం తర తరాలుగా వస్తుందన్నారు. బీజేపీ నాయకులు అందెల శ్రీరాములుయాదవ్, కాంగ్రెస్ నాయకులు కేఎల్లార్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రయ్య, కె.ప్రభాకర్, రాజేష్, రాజునాయక్, దేశ్యానాయక్ శ్రవణ్, కృష్ణానాయక్, ప్రసాద్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, రవినాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ శంషాబాద్ మున్సిపల్ శాఖ కార్యవర్గ సమావేశానికి హాజరైన కార్యర్గ సభ్యులు

శంషాబాద్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయొద్దు

శంషాబాద్, ఆగస్టు 16 : శంషాబాద్ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చెయ్యొద్దని బీజేపీ శంషాబాద్ మున్సిపాలిటీ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. బీజేపీ శంషాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ అధ్యక్షతన స్థానిక బేగమ్సు ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం కార్యవర్గ సమావేశం జరిగింది. శంషాబాద్ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చెయ్యొద్దని నాయకులు తీర్మానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు భూమిలో ఇంటి నంబర్లు జారీచేసిన విషయమై కమిషనర్ వివరణ ఇవ్వాలని కోరారు. అస్తవ్యస్తంగా ఉన్న ఇంటినెబర్లను శాస్త్రీయ పద్ధతి ద్వారా సరిచేయాలన్నారు. కూరగాయల మార్కెట్‌తో పాటు పలుప్రాంతాల్లో తైబజార్ మున్సిపాలిటీ పాలకవర్గం అనుమతి లేకుండా వసూలు చేస్తున్నారని, దానిని నియంత్రించాలని కోరారు. ఇంటి, నీటి పన్నులు ఒక పద్ధతి ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రేంరాజ్, నందకిశోర్, జగ్జీవన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వీరేష్, ఆనంద్ భాస్కర్‌రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు

అవినీతి రహిత సమాజం రావాలి

ప్రజాప్రతినిధులు ఆదర్శంగా ఉండాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



సమావేశంలో మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 16: అవినీతి రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లో శుక్రవారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేంద్ర పల్నాటి అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో బక్కని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్నా.. నేటికీ సమాజంలో అవినీతి పెరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వం జీతం ఇస్తుందన్న విషయాన్ని మర్చిపోయి, అవినీతికి తెగబడుతున్నారని ఆరోపించారు. కొన్ని కార్యాలయాల్లో ప్రతీ పనికి ఇంత అని లెక్కకట్టి తీసుకుంటున్నారని, చిన్నా, పెద్ద అనే తేడాలేకుండా కొందరు ఉద్యోగులు అక్రమార్జనకు పాల్పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు సైతం ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు పెట్టి, అధికారంలోకి రాగానే వందలు, వేల ఎకరాల భూములు, కోట్లాది రూపాయలను కూడబెట్టే సంస్కృతికి దూరం కావాలని కోరారు. సమాజంలో లంచం తీసుకోని అధికారులు ఎవరున్నారని వెతకాల్సి వస్తున్నదన్నారు. రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిపై 12 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, నిజాయితీ పరులైన ప్రజాప్రతినిధులను, అధికారులను సైతం వెతికి వారిని సన్మానిస్తూ, సమాజానికి మార్గదర్శులుగా నిలుపుతున్నామని తెలిపారు. ఈనెల 25న హైదరాబాద్‌లో 20మంది నిజాయితీ అధికారులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గాదిరాజు శ్రవంతి, కార్యవర్గ సభ్యుడు గంగాధర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు ఉత్తమ పురస్కారం



అవార్డు అందుకుంటున్న నటరాజ్ యాదయ్య

ఆమనగల్లు, ఆగస్టు 16: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకుగాను ఆమనగల్లు పట్టణానికి చెందిన ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, జిల్లా మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నటరాజ్ బిక్కుమళ్ల యాదయ్యకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో ప్రతీయేటా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేస్తారు. ఈ ఏడాది సామాజిక సేవలకు గాను యాదయ్యకు పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అధ్యక్షుడు కృష్ణకుమార్ అవార్డు అందజేశారు. ఐదు దశాబ్ధాలుగా కల్వకుర్తి ప్రాంతంలో యాదయ్య అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. సంఘం నాయకులు సత్యానారాయణ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా రాష్ట్ర అధ్యక్షుడిగా వికారాబాద్ వాసి



ఎండీ యాసీన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

వికారాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ముస్లిం రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వికారాబాద్‌కు చెందిన ఎండీ యాసీన్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన యునైటెడ్ ముస్లిం రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండీ యాసీన్ ఎన్నిక కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఇంతియాజ్, సహ అధ్యక్షుడిగా ఎండీ హబీబ్, సంయుక్త కార్యదర్శిగా షేక్‌గౌస్ పాషా, సహ కార్యదర్శులుగా షేక్ షబ్బీర్, షేక్ నసీర్ హుస్సేన్, కార్యదర్శులుగా ఎండీ ఖలీల్, ఎండీ ఖదీర్, ఎండీ యూసుఫ్ అహ్మద్, ఎండీ అబ్దుల్ ఉమేర్, గౌరవ అధ్యక్షుడిగా ఎండీ చాంద్‌పాషా, సమన్వయకర్తగా షేక్ మౌలాలి ఎన్నికయ్యారు. ఆయన ప్రతిష్టాత్మకమైన సంస్థకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం తన బాధ్యతను పెంచిందన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై వెంకటేష్

ఆమనగల్, ఆగస్టు 16: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని స్థానిక ఎస్సై బి.వెంకటేష్ కోరారు. విద్యార్థులు, యువత, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాల కోసం రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో డివైఎఫ్ఐ నాయకులతో కలిసి ఎస్సై ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పవన్‌కుమార్, వినోద్, చంద్రశేఖర్, చంద్రకుమార్ పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన స్కిల్ హబ్ సిటీ నగరం ఏర్పాటు

- భూములు ఇచ్చిన రైతులకు ఒకేచోట ఇంటి స్థలం
- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



బేగరికంచ గిరిజన మహిళలతో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

కందుకూరు, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు మండలంలో యుద్ధ ప్రాతిపాదికన నిర్మించతలపెట్టిన స్కిల్ హబ్‌సిటీ నాలుగో నగరం పనులు మరింత వేగవంతం చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని బేగరికంచ గ్రామాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించి, గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మా ఇండస్ట్రీస్‌కు భూములు ఇచ్చిన రైతులందరికీ ఒకే చోట ఇంటిస్థలాన్ని కేటాయించి, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.6లక్షలు, బీసీ, ఇతర కులాల రైతులకు రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు సైబరాబాద్ నగరాలను గత పాలకులు ఎంతో అభివృద్ధి చేశారని, భావితరాల కోసం ఈ ప్రాంతంలో నాలుగవ నగరంగా ముచ్చర్ల ప్రాంతాన్ని మరింత వేగవంతంగా అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు భూములను అమ్ముకోవద్దన్నారు. కాగా, ముందుగా అనుకున్నట్లుగా బేగంపేటలో అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవనం శంకుస్థాపన పనులను నిలిపివేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో తమ గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు బహిరంగంగానే ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శమంత ప్రభాకరరెడ్డి, మాజీ ఎంపీటీసీలు సరికొండ పాండు, నాయకులు ఎండీ అఫ్జల్‌బేగ్, బాలునాయక్, పాండుగౌడ్, రాంరెడ్డి, ఎస్.కృష్ణానాయక్, ఎస్టీ అజీజ్, సరికొండ జగన్, సరికొండ చిన్న జగన్, డిల్లీ శ్రీధర్, చంచు గణేష్, బొక్క భూపాల్‌రెడ్డి, బి.పాండురంగారెడ్డి, కృష్ణయ్య, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఈ.శ్రీకాంత్‌రెడ్డి, రాణా ప్రతాప్‌రెడ్డి, బొక్క సంజీవరెడ్డి, సుధాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉద్రిక్తత

- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీ..
- చివరకు సీట్లు లేవన్న యాజమాన్యం
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

మేడ్చల్ టౌన్, ఆగస్టు 16: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. మేనేజ్‌మెంట్ కోటా (బీ కేటగిరి) కింద విద్యార్థులను భర్తీ చేసుకుని చివరికి సీట్లు లేవనడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో యాజమాన్యం వారు మేనేజ్‌మెంట్ కోటాకింది విద్యార్థులను భర్తీ చేసుకుని. డబ్బులు తీసుకోవటంతో పాటు సర్టిఫికెట్లను జమ చేసుకున్నారు. ప్రస్తుతం తీసుకున్న డబ్బులు, సమర్పించుకున్న సర్టిఫికెట్లను తిరిగి ఇచ్చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల యాజమాన్యంతో గొడవపడి ఆందోళనకు దిగారు. సీట్ల కోటా తక్కువ ఉన్నప్పుడు విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడం సమంజసం కాదని పలువురు ఆరోపించారు. కనీసం బీ కేటగిరి వివరాలు ఆన్‌లైన్‌లో చూసుకోవటానికీ వీలు లేకుండా కళాశాల వెబ్‌సైట్‌ను మూసేశారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. పిల్లలకు కళాశాలలో సీటు దొరికిందని సంబురపడగా కళాశాల యాజమా న్యం తమకు షాక్‌కు గురిచేసిందన్నారు. కళాశాల యాజమాన్యం వారు చెల్లించిన డబ్బులు తిరిగివ్వటంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే క్రిమినల్ కేసులు



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

కొత్తూర్, ఆగస్టు 16: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీలు వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. ఇటీవల ఓ గిరిజన బాలికకు కొత్తూర్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు రంజిత్ అబార్షన్ చేసిన విషయం పాఠకులకు విధితమే. రంజిత్‌పై శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయమై స్పందించిన డీఎంఅండ్‌హెచ్‌వో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మీతో కలిసి రంజిత్ నడుపుతున్న శ్రీనివాసా ఆసుపత్రిని శుక్రవారం సీజ్ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ఆర్ఎంపీలు, పీఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా స్థాయికి మించి, ప్రజలకు హాని కలిగించేలా వైద్యం చేస్తున్నారని మండిపడ్డారు. రంజిత్ ఆయుర్వేద వైద్యుడని, 13ఏళ్ల బాలికకు నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేశాడని చెప్పారు. ఆర్ఎంపీ, పీఎంపీల చికిత్స కేంద్రాలను తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేసి, చికిత్స కేంద్రాలను సీజ్ చేస్తున్నా.. తిరిగి స్థాయికి మించి వైద్యం చేస్తున్నారని, అర్హత లేకున్నా ప్రథమ చికిత్స కేంద్రాల వద్ద భారీ బోర్డులు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారన్నారు. స్థాయికి మించి వైద్యం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా మాస్‌మీడియా అధికారి తిరుపతిరావు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, సీహెచ్‌వో నాగేష్, శ్రీకాంత్, నవాజ్, ఆశాలు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతాలు.. ప్రత్యేక పూజలు

శ్రావణ శుక్రవారం నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలు సంస్కృతి, సంప్రదాయాన్ని చాటాయి. తెలుగింటి ఆడపడుచులకు సౌభాగాన్ని, ఐశ్వర్యాన్ని ఇచ్చే పండుగైన వరలక్ష్మీ వ్రతాన్ని ప్రజలందరూ సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో నిర్వహించిన వ్రతాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ ఇంట చూసినా శ్రావణ వరలక్ష్మీ శోభ, ఆధ్యాత్మిక వాతావరణం వెల్లి విరిసింది. ఇళ్లల్లో లక్ష్మీ దేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు, వ్రతాలు నిర్వహించారు.



షాబాద్ : శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించిన సామూహిక వ్రతంలో మహిళలు



షాద్‌నగర్ అర్బన్ : లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, భక్తులు



చేవెళ్ల : వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



శంకర్‌పల్లి : రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



తలకొండపల్లి : పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీపీ నిర్మలా శ్రీశైలంగౌడ్, తదితరులు

కేటీఆర్‌కు మహిళలే బుద్ధి చెబుతారు

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- ఉచిత బస్సు ప్రయాణం, మహిళల పట్ల కేటీఆర్ వ్యాఖ్యలపై ఆగ్రహం
- క్షమాపణ చెప్పాలని డిమాండ్.. మహిళలతో కలిసి రామారావు దిష్టిబొమ్మలు దహనం

రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం ఆగస్టు 16 : ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడిన కేటీఆర్‌కు మహిళలే తగిన విధంగా గుణపాఠం చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గంలోని మందమల్లమ్మ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్ ప్రయాణంతో ప్రజల్లో వచ్చిన ఆదరణను చూసి కేటీఆర్ ఓర్వలేక, మతిస్థిమితం కోల్పోయి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేటీఆర్ ఆలోచనా విధానాన్ని మార్చుకొని, వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, తెలంగాణ మహిళ సమాజానికి క్షమాపణలు చెప్పాలని, లేదంటే.. మహిళలంతా ఏకమై కేటీఆర్ ఇంటిని ముట్టడించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సిద్ధిలా దశరథ్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ బాల్‌రెడ్డి, జిల్లెలగూడ జడ్పీహెచ్ఎస్ స్కూల్ చైర్మన్ గంగమ్మ, నాయకులు శేఖర్‌రెడ్డి, మట్ట సత్యనారాయణ గౌడ్, పరుశురాం, సంతోష్ విజయ రెడ్డి, సుభాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్ : కేటీఆర్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ క్యాడర్ ఖండిస్తూ, నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం సాయంత్రం షాద్‌నగర్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేసి, దహనం చేశారు. దిష్టిబొమ్మకు కేటీఆర్ చిత్రపటాన్ని పెట్టి కాంగ్రెస్ పార్టీ మహిళలు చెప్పుతో కొట్టి, నిరసన తెలిపారు. రాష్ట్ర మహిళలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు బాబర్ ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, చెన్నయ్య, బస్వం, అందె మోహన్, రాజేష్‌గౌడ్, వర్ష లక్ష్మణ్‌గౌడ్, నాగమణి, శ్రీదేవి, వాసు, మన్నే రవి తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం : కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం : మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదుల్ల పాండురంగారెడ్డి అన్నారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చౌరస్తాలో నిరసన తెలిపి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ ఆకుల మమత, మల్లిక, బి.మహిపాల్, చింతం బాల్‌రాజ్‌యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు ఆకుల ఆనంద్‌కుమార్, గురునాథ్‌రెడ్డి, పండాల శంకర్‌గౌడ్, ఎల్.నరహరి తదితరులున్నారు.

ఆమనగల్లు : కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలపై మహిళలు, కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. పట్టణంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్యల ఆధ్వర్యంలో మహిళలు, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ చౌక్‌వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్, కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎంపీపీ ధనుంజయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణనాయక్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మండ్లీ రాములు, రవీందర్ నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : కేటీఆర్ దొర అహంకార పోకడలు వీడకపోతే తగిన గుణపాఠం తప్పదని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధిని గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబాలు అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. శంకర్, పాండు, ఆనంద్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మహిళలు, కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ చేపట్టి ప్రధాన రహదారిపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మోహన్‌రెడ్డి, రవీందర్‌యాదవ్, అజీం, రాములు, తిరుపతిరెడ్డి, రమేశ్ యాదవ్, తదితరులున్నారు.

మాడ్గుల : మహిళలపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయటంపై మండల కేంద్రంలో మహిళలతో కలిసి కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మాజీ ఎంపీపీ జంగయ్య, మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ దేవయ్యగౌడ్, నూదిని శరత్‌రెడ్డి, ఎమ్మె శ్రీనువాస్, రేవంత్‌రెడ్డి మిత్రమండలి అధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

కందుకూరు : కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు డిమాండ్ చేశారు. హైద్రాబాద్-శ్రీశైలం జాతీయరహదారిపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్, సరికొండ పాండు, ఎండీ అఫ్జల్‌బేగ్, వినోద్ చారి, ఎస్డీ అజీజ్, సరికొండ జగన్, తదితరులున్నారు.

షాబాద్ : ఉచిత ప్రయాణ సౌకర్యం ద్వారా ప్రయాణించే మహిళలు అల్లికలకు, రికార్డింగ్ డ్యాన్సులకు ఉపయోగిస్తున్నారని కేటీఆర్ చేసిన దిగజారుడు వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. కంది-షాద్‌నగర్ జాతీయ రహదారిపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి భార్గవ రామ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, నర్సింహులు, నాయకులు రవీందర్, అక్తర్ పాశ, మాధవరెడ్డి, అస్మత్‌పాశ, పెంటారెడ్డి, అశ్వక్ అలీ, రాహుల్‌గుప్తా, నర్సింహులు, వెంకట్‌రెడ్డి, శ్రీను, శివకుమార్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న నాయకులు

చౌదరిగూడ : కేటీఆర్ మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జిల్లేడ్ చౌదరిగూడలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు చౌదరిగూడ బస్టాండ్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేటీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు చంద్రశేఖర్, వెంకటనర్సింహరెడ్డి, యాదగిరి గౌడ్, మస్సుద్, అన్వర్, యాదయ్య, సలాం, హసన్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : ఉచిత బస్సులో మహిళల ప్రయాణంపై కేటీఆర్ వాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేపట్టారు. కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్ నాయకులు జిల్లెల్ల బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి, రాములు, చిందం నర్సింలు, సుమన్, అంజి యాదవ్, శంకరయ్య, జంగయ్య, రాంరెడ్డి, రమేష్, యాదయ్య, లింగం, సి.నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : కేటీఆర్ మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యాలను నిరసిస్తూ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జె. సుదర్శన్‌గౌడ్, కమ్మరి జనార్ధన్‌చారి, జెనిగె జగన్, ఇందూరి శ్రీనివాస్, జగన్‌గౌడ్, చిలకమర్రి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల : కేటీఆర్ దిష్టిబొమ్మతో మహిళలు, కాంగ్రెస్ నేతల నిరసన ర్యాలీ

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి



చేవెళ్ల, ఆగస్టు 16 : మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎ.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వాజ్‌పేయి జాతీయ రహదారులను నిర్మించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, జయసింహారెడ్డి, సీహెచ్ శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు : ఎమ్మెల్యే

షాద్‌నగర్, ఆగస్టు 16: రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఆర్ఎంపీ) తమ పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డిప్యూటీ డీఎంహెచ్‌వోతో కలిసి ఆర్ఎంపీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు తమ పరిమితులకు లోబడే గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. కొందరు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి వైద్యం చేస్తున్నారని, దీనివల్ల ఆర్ఎంపీ వైద్యులందరికీ చెడ్డపేరు వస్తుందన్నారు. రోగుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడరాదని మందలించారు. పరిధి దాటి వైద్యం చేస్తున్న వారి పట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది ఒక కంట కనిపెట్టి వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మిని ఆదేశించారు.



ఆర్ఎంపీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

బాధితుడికి ఎల్వోసీ అందజేత

ఫరూఖ్‌నగర్ మండలం చెల్కచిలుకమర్రికి చెందిన మహ్మద్ సర్దార్ ఖాన్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బాధితుడి తండ్రి మహ్మద్ జహంగీర్ ఖాన్‌కు అందజేశారు.

కోదండరామ్‌కు ఎమ్మెల్యే అభినందనలు

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నుకోబడిన ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. శాసనసమండలిలో ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కోదండరాంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సంక్షిప్తంగా..

కందుకూరు : మండంలోని బాచుపల్లి గ్రామ స్వశక్తి యువ జన సంఘం అధ్యక్షునిగా ఎగిరిశెట్టి అనంత్ ఎన్నికైయ్యారు. సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఉపాధ్యక్షుడిగా చాకలి రాఘవేందర్, ప్రధానకార్యదర్శి ఎగిరిశెట్టి వంశీధర్, కోశాధికారిగా అనే గౌని హరీష్‌గౌడ్ ఎన్నుకున్నట్లు తెలిపారు.

కడ్తాల్ : పనితీరు ఆధారంగానే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని డీసీసీ అధికార ప్రతినిధిని గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారులుగా సేవాపతకాలు, అవార్డులు అందుకున్న కడ్తాల తహసీల్దార్ ముంతాజ్, ఎస్ఐ వరప్రసాద్‌లకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆమనగల్లు : రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బందిపై దాడులు సరికాదని ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హెడ్‌నర్స్ ఏసుమణి, నర్సింగ్ ఆఫీసర్ సునితలు అన్నారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్, ఆశా కార్యకర్తలపై దాడి చేసి గాయపరిచిన రోగి సహాయకులైన మహిళలను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

కడ్తాల్ : ప్రజారోగ్యపరిరక్షణ కు ప్రభుత్వాలు పెద్ద పీట వేయాలని మాజీ జడ్పీటీసీ, జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ కోరారు. పేదలకు వైద్యాన్ని పూర్తిగా కార్పోరేట్ స్థాయిలో ఉచితంగా అందించి వారికి మనోధైర్యాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కడ్తాల మండల కేంద్రానికిచెందిన ఎగిరిశెట్టి శంకరయ్యకు రూ.60వేలు, ఫాతిమా కు రూ.20వేలు సీఎం సహాయనిధి ద్వారా మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి సహకారంతో మంజూరయ్యాయి. మండల కేంద్రంలో బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, నాయకులు పాండు, లాయక్ అలీ, ఈర్శాద్, కంబాలపల్లి రమేశ్, శ్రీను, బీమన్, మహేశ్,మూడ రవి, సత్యం,రాజు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై జరిగిన అత్యాచారం, దారుణ హత్యకు సంబంధించిన నిందితులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వైద్యవిద్యార్థులు డిమాండ్ చేశారు. ఆమె హత్యకు నిరసనగా శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో సీనియర్, జూనియర్ వైద్యులు, వైద్యవిద్యార్థులతో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. మృతి చెందిన విద్యార్థికి సంఘీభావం తెలుపుతూ కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. కళాశాల డీన్ డాక్టర్ పీవీ సత్యానారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణరెడ్డిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను అరికట్టాలి

మహేశ్వరం, ఆగస్టు 16 : బంగ్లాదేశ్‌లో హిందువులపై రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టి. వీరేందర్‌గౌడ్ అన్నారు. అక్కడి హిందువులపై అరాచకాలు, అత్యాచారాలు, మారణ హోమాలను ఆపకపోతే రేపు మన దేశ పరిస్థితి కూడా అలాగే తయారవుతుందని అభిప్రాయపడ్డారు. బంగ్లాదేశ్‌లో దాడుతను నిరసిస్తూ శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో హిందువులపై ఎక్కడ దాడులు జరిగినా మనందరం స్పందించాలన్నారు. ప్రపంచ శాంతిని కోరుకునేది ఒక్క హిందూ ధర్మమేనన్నారు. హిందూ ధర్మాన్ని నిర్మూలించాలని ఎన్నో వందల సంవత్సరాలనుండి కొందరు ప్రయత్నిస్తున్నారని, దేశంలోని హిందువులందరు ఏకమై మన ధర్మాన్ని కాపాడడంతో పాటు ప్రపంచంలోని హిందువులను రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా మనందరిపైనా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె. మధుమోహన్, నాయకులు అశోక్, యాదగిరిరెడ్డి, శివయ్య, సుధాకర్, విలాస్, రాజు, శ్రీనివాస్, నర్సింగ్, యాదగిరి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బంగ్లాదేశ్ దాడులకు నిరసనగా తుక్కుగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కేశంపేట, ఆగస్టు 16: బైక్‌పై నుంచి కిందపడిన ఘటనలో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందగా, మరో యువకుడు చికిత్స పొందుతున్నాడు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఎక్లాస్ ఖాన్‌పేటకు చెందిన బట్టు మహేష్(23), జగదీష్‌లు పెయింటర్లుగా పనిచేస్తున్నారు. ఈ నెల 14న రాత్రి 12గంటల సమయంలో ఇద్దరు షాద్‌నగర్ నుంచి స్వగ్రామం ఎక్లాస్‌ఖాన్‌పేటకు బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో ఎక్లాస్‌ఖాన్‌పేట శివారులో బండ యాదయ్య వ్యవసాయ పొలంవద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. దాంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైనాయి. ఉదయం వరకూ ఎవరూ గమనించలేదు. ఉదయం 6గంటల సమయంలో పొలాలకు వెళ్లేవారు గమనించి కటుంబ సభ్యులకు సమాచారం అందించారు. షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం బట్టు మహేష్ మృతి చెందాడు.

కుటుంబ సభ్యులకు మృతదేహాల అప్పగింత

శంషాబాద్ రూరల్, ఆగస్టు 16 : పెద్దగోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహ్మద్ తాజొద్దీన్, వరాలు, రెండు నెలల బాబు మృతదేహాలకు గురువారం ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టు మార్టం పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు శంషాబాద్ పోలీసులు తెలిపారు. కాగా, శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురిని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిముదిరాజ్ ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం నగరంలోని నిమ్స్‌కు తరలించినట్లు బాధితులు బంధువులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడని వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వైద్యులను ఫోన్ ద్వారా కోరారు. బాధిత కుటుంబలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

4 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్టు

ఆదిభట్ల, ఆగస్టు 16: గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి నాలుగు కిలోల గంజాయి(లిక్విడ్)ను స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చేసుకుంది. సీఐ రాఘవేందర్ తెలిపిన సమాచారం మేరకు.. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో టీసీఎస్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సీఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అనుమానితులైన టి.సుధీర్‌రెడ్డి, టి.దేముళ్ళు కె. శంకర్‌రావు ఇళ్లలో తనిఖీలు చేశారు. వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు.

సర్దార్ పాపన్న పోరాట పటిమ ఆదర్శనీయం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, ఆగస్టు 16: సర్దార్ పాపన్న పోరాట పటిమ, సేవానిరతి అందరికీ ఆదర్శనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. చరికొండ గ్రామంలో ఈనెల 18న నిర్వహించే సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ ఎంపీటీసీ పాలకుర్ల రాములు, కాంగ్రెస్ నాయకుడు గౌని లక్ష్మయ్య, గౌడ సంఘం నేతలతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డితోపాటు బీసీ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్, గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకుడు అయిలీ వెంకన్నగౌడ్‌లకు గౌడ సంఘం నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉడుతల రాములు, కొప్పుల అంజయ్య, మహేందర్‌గౌడ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'శ్రీకృష్ణాంజనేయ యుద్ధం' నాటక ప్రదర్శన

శంకర్‌పల్లి, ఆగస్టు 16 : జన్వాడ గ్రామంలో శ్రీకృష్ణాంజనేయ యుద్ధం పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జనతా సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నేడు(శనివారం) సాయంత్రం 5 గంటలకు పద్మా రవిందర్‌గౌడ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. జనతా సేవా సమితి మహబూబ్‌నగర్ కళాకారులచే శ్రీవరకవుల నరహరిరాజు సంగీత దర్శకత్వంలో జరిగే నాటక ప్రదర్శనకు గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అనుమతి లేకుండా అంగన్‌వాడీ కేంద్రం కూల్చివేత!

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 16: ఫరూక్‌నగర్ మండలం అన్నారం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండానే అంగన్ వాడీ భవనం కూల్చివేశారు. శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ భవనంలో నుంచి పిల్లలను మూడేళ్ల కింద పాఠశాల భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి అక్కడే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. ఆ స్థలంలో అంగన్‌వాడీ భవనంతో పాటు మహిళా సమాఖ్య భవనం నూతనంగా నిర్మించాలని గతంలో గ్రామ పంచాయతీ ప్రతిపాదనలు పంపింది. కొన్ని కారణాల వల్ల నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం మారిన తర్వాత మొదట పంపిన ప్రతిపాదనలు తిరిగి పంపించిన మాజీ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి సదరు భవనానికి రూ.10లక్షలు జడ్పీ నిధుల నుంచి మంజూరు చేయించారు. ఇటీవల ప్రొసీండిగ్‌ను ఎమ్మెల్యే శంకర్ చేతులమీదుగా అందించారు. కానీ భవనం అనుమతి లేకుండా ఎలా కూల్చివేస్తారని గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

కందుకూరు, ఆగస్టు 16: మండలంలోని కొత్తూరులో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మానానికి గ్రామానికి చెందిన దయ్యాల శ్రీనివాస్ రూ.లక్ష విరాళం ఇచ్చారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తోకల దశరథ, నర్సింహ, వెంకట్‌రెడ్డి, తోకల రాజు, కర్నాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి చేయూత

చేవెళ్ల, ఆగస్టు 16 : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థి లక్ష రూపాయాలు విరాళం ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధి దేవుని ఎర్రవల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి సామ రంగారెడ్డి పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష చెక్కును ప్రధానోపాధ్యాయుడు రాములకు అందజేశారు. రంగారెడ్డిని గ్రామస్తులు, చేవెళ్ల మండల ప్రజలు అభినందించారు. అలాగే దామరగిద్దకు చెందిన మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు స్మార్ట్ టీవీని ఉచితంగా అందజేశారు. మాజీ సర్పంచ్‌లు శ్యామలయ్య, మాణిక్యరెడ్డి, అంజయ్య, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, నాయకులు, శ్రీనివాస్, జంగయ్య గౌడ్, సుహన్, రామయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఆర్థిక సాయం

కందుకూరు, ఆగస్టు 16: మండలంలోని ఆకులమైలారంలో రోడ్డు విసరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన 30 మందికి ఆ గ్రామానికి చెందిన శంకరి తిరుపతయ్య సొంత నిధులతో ఒక్కొక్కరికి రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం ఆ గ్రామస్తులతో కలిసి నగదును బాధితులకు తిరుపతయ్య అందజేశారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆవోపా అధ్యక్షుడిగా ఎలుకుర్తి నాగరాజు

షాద్‌నగర్, ఆగస్టు 16: ఆవోపా షాద్‌నగర్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎలుకుర్తి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా శివ కార్తీక్‌ను కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. శుక్రవారం పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ప్రాంగణంలో ఎంవీఎస్ సురేష్ అధ్యక్షతన ఆవోపా సమావేశం జరిగింది. నూతనంగా ఎన్నికైన సభ్యులచే ఆవోపా రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ది శంకర్ నూతనంగా ఎన్నుకున్న కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన కమిటీతో పాటు, ప్రతి ఒక్కరూ కూడా సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు, షాద్‌నగర్ పట్టణ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.